# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 99 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 21 జులై 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి





# శంషాబాద్-తిరుపతి స్పైస్‌జెట్ విమానంలో సాంకేతిక లోపం

శంషాబాద్,జూలై20(ప్రభాత ఉదయం)

ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలు విమాన ప్రయాణం అంటేనే ప్రయాణికులు భయపడేలా చేస్తున్నాయి. అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా ఘటన మరువక ముందే పలు విమానాలు సాంకేతిక సమస్యలతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అవుతున్నాయి. తాజాగా శంషాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన స్పైస్‌జెట్ ఎస్‌జీ-2138 విమానంలో టెక్నికల్ ఇష్యూస్‌తో నిలిచిపోయింది. విమానం బయల్దేరడానికి ముందే సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్ విషయాన్ని అధికారులకు చేరవేశారు. దీంతో సంస్థ ఆ సర్వీసును రద్దుచేసింది. అందులో తిరుపతి వెళ్లాల్సిన 54 మంది ప్రయాణికులను మరో విమానంలో పంపారు. దీంతో సాంకేతిక సమస్యను ముందుగానే గుర్తించడంతో పెను ప్రమాదమే తప్పిందని ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. అదే గాల్లో ఉండగా ఏదైనా జరిగితే తమ పరిస్థితి ఎలా ఉండేదోనని అంటున్నారు. గత నెల 16న కూడా ఇదే సర్వీస్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన స్పైస్ జెట్ 2138 నంబర్ విమానంలో కాలిన వాసన రావడంతో విమాన సిబ్బంది అలర్ట్ అయ్యారు. టేకాఫ్ ముందే ఫ్లైట్‌ని ఎయిర్ పోర్టులో నిలిపివేసి చెక్ చేసారు. క్షణాల్లో గాల్లో ఎగరాల్సిన విమానం సాంకేతికలోపం కారణంగా ఎయిర్ పోర్టులో నిలిపివేయడంతో ప్రయాణికులు సుమారు మూడున్నర గంటల పాటు ఇబ్బందులు పడ్డారు.

# హైదరాబాద్‌లో బోనాల సందడి

## లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

హైదరాబాద్, జులై 20 (ప్రభాత ఉదయం)

హైదరాబాద్‌లో బోనాల పండుగ సందడి అంబరాన్నంటింది. పవిత్ర ఆషాఢ మాసం సందర్భంగా నగరంలోని మహంకాళి అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి జాతరతో భాగ్యనగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,





పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఇక బోనాల పండుగా సందర్భంగా కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ తల్లిని ఎమ్మెల్సీ కవిత దర్శించుకోగా.. చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారిని బండారు దత్తాత్రేయ దర్శించుకున్నాడు. ఆలయాల పరిసరాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలు కూడా అమలులో ఉన్నాయి. విద్యుత్ అలంకరణలు, తాగునీటి సౌకర్యాలు, ఆరోగ్య శిబిరాలు వంటి ఏర్పాట్లు భక్తులకు అందుబాటులో ఉంచారు. మొత్తంమీద, బోనాల పండుగ మహోత్సవం హైదరాబాద్‌లో భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతోంది.

### ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నా!

లాల్‌దర్వాజ బోనాల సందర్భంగా సింహవాహిని అమ్మవారిని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ

..మిగతా 2లో



# వరద జోరు... సందర్శకుల హెూరు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 20 (ప్రభాత ఉదయం)

ఓ వైపు కృష్ణానదికి వరద జోరు కొనసాగుతుండగా మరో వైపు వరద జోరును తిలకించడానికి సందర్శకుల తాకిడి పెరిగింది. జూరాల ప్రాజెక్టుకు ఎగువ జలాశయాల నుంచి భారీగా వరద వస్తుండటంతో అధికారులు ప్రాజెక్టు 19 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 1.07 లక్షల క్యూసెక్కుల వరద దిగువకు వెళ్తున్నది. ఇందులో స్పిల్‌వే ద్వారా 74,081 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 29,464 క్యూసెక్కులు వరద నీటిని వినియోగిస్తున్నారు. దీంతో పాటు ఆయకట్టు మీద ఆదారపడిన నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు, కుడి,ఎడమ కాలువలకు 1630, సమాంతర కాలువలకు 700, భీమా లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ ఎత్తిపోతలకు 315 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. ఇక జూరాల ప్రాజెక్టు మొత్తం నీటిమట్టం 318.51 మీటర్లు కాగా ప్రస్తుతం 317.360 మీటర్లు ఉన్నది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకు గాను ఇప్పుడు 7.389 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

## మరోసారి విదేశీ పర్యటనకు నరేంద్ర మోదీ

### బ్రిటన్, మాల్దీవుల్లో ప్రధాని టూర్



హైదరాబాద్, జులై 20 (ప్రభాత ఉదయం)

ప్రధాని నరేంద్ర మోదీ జులై 23-24 తేదీల్లో బ్రిటన్‌లో పర్యటించనున్నారు. ఇది మోదీకి నాల్గో అధికారిక పర్యటన కానున్నది. అనంతరం ప్రధాని మోదీ జులై 25-26 తేదీల్లో మాల్దీవుల్లో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు డాక్టర్ మొహమ్మద్ మోయిజు ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి మోదీ మాల్దీవుల పర్యటనకు వెళ్లబోతున్నారు. ఇది ఆయనకు మూడో మల్దీవుల పర్యటన. అధ్యక్షుడు మోయిజు మాల్దీవుల్లో అధికారం చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ

..మిగతా 2లో

# భారత్ మరో కీలక ఘనత

### మలేరియా నివారణకు స్వదేశీ వ్యాక్సిన్

### భారతీయ పరిశోధన సంస్థల కీలక ముందడుగు

### 'అడ్‌ఫాల్సివాక్స్' పేరిట స్వదేశీ మలేరియా వ్యాక్సిన్ అభివృద్ధి

### సంప్రదాయ వ్యాక్సిన్‌లతో పోల్చితే విస్తృత రక్షణ

న్యూఢిల్లీ, జులై 20 (ప్రభాత ఉదయం)

భారత్ మలేరియా నిర్మూలన దిశగా కీలక ముందడుగు వేసింది. భారత వైద్య పరిశోధన మండలి , భువనేశ్వర్‌లోని రీజనల్ మెడికల్ రీసెర్చ్ సెంటర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్ మరియు డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ సంయుక్తంగా 'అడ్‌ఫాల్సివాక్స్' అనే స్వదేశీ మలేరియా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తున్నాయి.

ఈ వ్యాక్సిన్‌ను మలేరియాకు కారణమయ్యే అత్యంత ప్రమాదకరమైన ప్లాస్మోడియం ఫాల్సిపారమ్ పరాన్నజీవి యొక్క రెండు కీలక దశలను లక్ష్యంగా చేసుకుని రూపొందించారు. ప్రీ-క్లినికల్ పరీక్షల్లో ఈ వ్యాక్సిన్ అద్భుతమైన ఫలితాలను చూపింది. ఇది ప్లాస్మోడియం ఒకే దశను లక్ష్యంగా చేసుకునే సాంప్రదాయ వ్యాక్సిన్‌లతో

..మిగతా 2లో






## పైలట్ పొరపాటు అంటూ తప్పుడు కథనాలు

### విదేశీ మీడియాపై మండిపడిన మంత్రి

హైదరాబాద్, జులై 20 (ప్రభాత ఉదయం)

ఎయిరిండియా విమాన ప్రమాదంపై విదేశీ మీడియాలో వస్తున్న తప్పుడు కథనాలను కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ఖండించారు. పైలట్ పొరపాటు వల్లే ఘోర ప్రమాదం అంటూ అమెరికాకు చెందిన ది వాల్ స్ట్రీట్ జర్నల్, రైటర్స్ సంస్థలు

..మిగతా 2లో

# హైదరాబాద్‌లో బోనాల సందడి

**మొదటి పేజీ తరువాయి...**

సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ దర్శించుకున్నారు. దర్శన అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. దర్శనం తర్వాత మంత్రి పొన్నంమీడియాతో మాట్లాడుతూ%ొ*% ఆషాఢ మాస బోనాల సందర్భంగా లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి ఆలయంలో అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందని తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయు ఆరోగ్యాలతో ఉండాలని.. మంచి వర్షాలతో పాడి పంటలు సంవృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నా అని చెప్పారు.

'గత నెల 26న గోల్కొండ బోనాలతో ప్రారంభమై.. జూలై 1 బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, 13వ తేదీ శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాలు, ఈరోజు లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి బోనాలు జరుపుకుంటున్నాం. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నా. హైదరాబాద్ బోనాల ఏర్పాట్లలో రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, పోలీస్, దేవాదాయ శాఖతో సమన్వయం చేసుకొని ఎక్కడ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. హైదరాబాద్ ప్రజలు బోనాల పండగకు ఆతిథ్యం ఇచ్చారు. అమ్మవారి కటాక్షం, లక్ష్మి కటాక్షం, విద్యా కటాక్షం ఉండేలా అమ్మవారి ఆశీర్వాదం ఉండాలి. అమ్మవారి బోనాల సందర్భంగా ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'ఎంతో ఘనంగా బోనాల ఉత్సవాలు తెలంగాణ రాష్ట్రంలో జరుపుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది. రాష్ట్ర ప్రజల తరుపున ఈ సమాజాన్ని, రాష్ట్రాన్ని క్షేమంగా చూడాలని, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధిగా చూడాలని కోరుకున్నాము. ఆలయానికి తరలి వచ్చిన వేలాది మంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించి ఎంతో ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉంది. బోనాల ఉత్సవాలకు 20 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగింది. ఈ ప్రాంత అభివృద్ధి, దేవాలయ అభివృద్ధికి తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నాం' అని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క పేర్కొన్నారు.





## మరోసారి విదేశీ పర్యటనకు నరేంద్ర మోదీ

**మొదటి పేజీ తరువాయి...**

మాల్దీవుల పర్యటన ఒక విదేశీ దేశాధినేత తొలి పర్యటన కానున్నది. యూకే పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో వివిధ అంశాలపై చర్చించనున్నారు. ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై ఇద్దరు నాయకుల మధ్య చర్చలు జరుగనున్నాయి. ప్రధానమంత్రి మోదీ తన యూకే పర్యటన సందర్భంగా కింగ్ చార్లెస్-3ను సైతం కలిసే అవకాశం ఉన్నది. రెండు దేశాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం, పురోగతిపై చర్చించనున్నాయి. వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, ఆవిష్కరణ, భద్రత, వాతావరణ మార్పులు, ఆరోగ్యం, విద్య, ప్రజల మధ్య సంబంధాలను మెరుగుపరచడం తదితర అంశాలపై చర్చలుంటాయి. జూలై 26న జరిగే మాల్దీవుల 60వ స్వాతంత్ర్య దినోత్సవానికి ప్రధానమంత్రి మోదీ ముఖ్య అతిథిగా హాజరవుతారు. వివిధ అంశాలపై మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ మొయిజుతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. భారత్-మాల్దీవులు ఉమ్మడి ఆర్థిక, సముద్ర భద్రతా ఒప్పందంపై పురోగతిని ఇద్దరు నాయకులు సమీక్షిస్తారు. 2024 అక్టోబర్‌లో మొహమ్మద్ మొయిజు భారతదేశాన్ని సందర్శించినప్పుడు రెండు దేశాల మధ్య ఈ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే.





## మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి

### సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌కు భారీ నజరానా

**హైదరాబాద్, జులై 20 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ నాటు నాటు పాటతో ఆస్కార్ అవార్డు అందుకుని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఈ హైదరాబాద్ పోరడికి తెలంగాణ సర్కార్ భారీ నజరానా ప్రకటించింది. బోనాల పండగను పురస్కరించుకుని సీఎం రేవంత్ రెడ్డి రాహుల్ కు రూ.కోటి పురస్కారాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఈ టాలీవుడ్ సింగర్ పై సీఎం రేవంత్ ప్రశంసల జల్లు కురిపించారు. 'సొంత కృషితో ఎదిగిన రాహుల్ సిప్లిగంజ్ తెలంగాణ యువతకు మార్గదర్శకుడు' అని రాహుల్ ను కొనియాడారు. రాహుల్ సిప్లిగంజ్, కాల భైరవ కలిసి పాడిన 'నాటు నాటు' పాట ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ గెలుచుకుంది. మార్చి 2023 లో జరిగిన 95వ అకాడమీ అవార్డుల వేడుకలో వీరు ఈ పాటను ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఆ వేడుకలో ఈ పాట ఉత్తమ ఒరిజినల్ సాంగ్‌గా ఎంపికైంది. ఆస్కార్ అవార్డు పొందిన అనంతరం రాహుల్ సిప్లిగంజ్‌కు 12 మే 2023న టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి రూ.10 లక్షల నగదు ప్రోత్సాహకం అందించారు. అదే సందర్భంగా తాము అధికారంలోకి వస్తే రాహుల్‌కు రూ.కోటి నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు. ఇక ఇటీవల తెలంగాణ ప్రభుత్వం గద్దర్ ఫిలిం అవార్డ్స్ పేరుతో పలువురు సినీ ప్రముఖులను ఘనంగా సన్మానించింది. ఇదే అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ సిప్లిగంజ్ పేరును ప్రత్యేకంగా ప్రకటించారు. గద్దర్ అవార్డు కాకపోయినా.. హైదరాబాద్ లోకల్

కుర్రాడు అయిన రాహుల్ సిప్లిగంజ్ కు ప్రత్యేక అవార్డు ఏదైనా ఉంటే ప్రకటించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరారు. దీనికి ఆయన కూడా అంగీకరించారు. ఈ క్రమంలో తాజాగా సింగ్ రాహుల్ కు బోనాల పండగ సందర్భంగా కోటి రూపాయల నగదు పురస్కారాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.



## పైలట్ పొరపాటు అంటూ తప్పుడు కథనాలు

**మొదటి పేజీ తరువాయి...**

వార్తలు ప్రచురించడాన్ని మంత్రి తీవ్రంగా తప్పుబట్టారు. ఆదివారం మాట్లాడిన ఆయన.. తనకు విమాన ప్రమాద దర్యాప్తు సంస్థపై పూర్తి విశ్వాసం ఉందని.. స్వలాభం కోసమే పాశ్చాత్య మీడియా ఈ ఘటనపై అసత్య కథనాలు ప్రచారం చేస్తుందని అన్నారు.

'నాకు ఏఏఐబీపై పూర్తి నమ్మకం ఉంది. ప్రమాదానికి దారితీసిన కారణాలను ఆ సంస్థ కనుగొంటుందని విశ్వసిస్తున్నా. భారత్‌లో డేటాను డీకోడింగ్ చేయడంలో వాళ్లు సఫలీకృతం అయ్యారు. నిజంగా ఇది అతి పెద్ద విజయం. మరో విషయం.. ఏఏఐబీ అందరికి ఒక విజ్ఞప్తి చేస్తోంది. ముఖ్యంగా పాశ్చాత్య మీడియా సంస్థలు తమ సొంత ప్రయోజనాల కోసం ఎయిరిండియా ప్రమాదంపై పనిగట్టుకొని మరీ అసత్య కథనాలను వెలువరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ వైఖరి మానుకోవాలని కోరుతున్నాం' అని మంత్రి వార్నింగ్ ఇచ్చారు.

విమాన ప్రమాదానికి కారణాలను విశ్లేషించే బాధ్యత ఏఏఐబీ తీసుకున్నందున ఊహాగానాలను ప్రచారం చేయొద్దని మంత్రి కోరారు. 'తుది నివేదిక వచ్చేంత వరకూ ఎవరూ కూడా ఊహాజనిత కామెంట్లు చేయొద్దు. అందుకే మేము దర్యాప్తు సవ్యంగా జరిగేలా చూసుకుంటున్నాం. రిపోర్టు వచ్చాకే అన్ని విషయాలు తెలుస్తాయి' అని మంత్రి పేర్కొన్నారు. అహ్మదాబాద్‌లో జూన్ 12న ఎయిరిండియా బోయింగ్ 171 విమానం కుప్పకూలింది. ఈ ఘోర ప్రమాదంలో 230 మంది ప్రయాణికుల్లో విశ్వాస్ కుమార్ అనే ఒక వ్యక్తి మినహా అందరూ మృత్యువాత పడ్డారు. 12 మంది సిబ్బంది కూడా దుర్మరణం చెందారు.



## పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

### సభ ముందుకు 8 కీలక బిల్లులు

**న్యూఢిల్లీ, జులై 20 (ప్రభాత ఉదయం)**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాడివేడిగా ప్రారంభం కాబోతున్నాయి. వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు సమావేశాలు జరుగనున్నాయి.

పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా ఉభయ సభలు సమావేశమవుతున్నాయి. 21 రోజులపాటు జరుగనున్న ఈ సమావేశాలు వాడీవేడిగా కొనసాగే అవకాశాలున్నాయి.

సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఇండి కూటమి నేతల కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 10 పార్టీల నేతలు హాజరయ్యారు. ఆపరేషన్ సింధూర్‌పై కేంద్రాన్ని పార్లమెంట్ సమావేశాల్లో నిలదీయాలని ఇండి కూటమి నేతలు నిర్ణయించారు. ఆపరేషన్ సింధూర్‌పై కేంద్రం ఇప్పటికి కూడా వాస్తవాలు వెల్లడించడం లేదని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని విపక్ష నేతలు వెల్లడించారు. విదేశాంగ విధానంపై ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. మరోవైపు ఆపరేషన్ సింధూర్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై రాజకీయ రచ్చ రాజుకుంది. చాలా యుద్ధాలను తాను ఆపినట్టు ట్రంప్ ప్రకటించుకున్నారు. లేదంటే రెండు దేశాల మధ్య న్యూక్లియర్ వార్ జరిగేదన్నారు. అంతేకాకుండా యుద్ధంలో ఐదు ఫైటర్ జెట్స్‌ను కూల్చేశారని అన్నారు ట్రంప్. అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలపై బీజేపీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేతలు నిలదీస్తున్నారు. ట్రంప్ మాటలను ట్వీట్ చేశారు కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ. ఐదు యుద్ధ విమానాలు కూలిపోయాయని ట్రంప్ అంటున్నారని , దేశ ప్రజలు దీనిపై స్పష్టత కోరుకుంటున్నారని రాహుల్ ట్వీట్ చేశారు. ట్రంప్ తాజా వ్యాఖ్యలతో పార్లమెంట్ సమావేశాల్లో బీజేపీ , కాంగ్రెస్ ఎంపీల మధ్య మాటలయుద్ధం మరింత ముదిరే అవకాశాలు ఉన్నాయి. అయితే ఇండి కూటమి సమావేశానికి ఆప్ ఎంపీలు హాజరుకాలేదు. ఇండి కూటమితో తమకు సంబంధం లేదని , పార్లమెంట్ వరకే తమకు పొత్తు ఉందని , కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో 8 బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టబోతోంది. ఈ సందర్భంగా ఏడు పెండింగ్ బిల్లులతోపాటు 8 కొత్త బిల్లులను ప్రవేశపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు, జియోహెరిటేజ్ సైట్స్, జియో రెలిక్స్ (సంరక్షణ, నిర్వహణ) బిల్లు, మైన్స్ అండ్ మినరల్స్ (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, నేషనల్ యాండీ డోపింగ్ (సవరణ) బిల్లు, మణిపూర్ వస్తు సేవల పన్ను (సవరణ) బిల్లు వంటివి ఇందులో ఉన్నాయి. వీటితోపాటు ఇన్‌కం ట్యాక్స్-2025 బిల్లును కూడా కేంద్రం ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. విపక్షం లేవనెత్తే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తామని కేంద్రమంత్రులు స్పష్టం చేస్తున్నారు.

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు సిటింగ్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మను అభిశంసించే తీర్మానం కూడా ఈ సమావేశాలలోనే పార్లమెంటు ముందుకు రానుంది. వర్షాకాల సమావేశాల సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

## భారత్ మరో కీలక ఘనత





**మొదటి పేజీ తరువాయి...**

పోలిస్తే విస్తృత రక్షణను అందిస్తుందని, రోగనిరోధక వ్యవస్థ నుంచి మలేరియా పరాన్నజీవి తప్పించుకునే అవకాశం తక్కువగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. దీర్ఘకాల రోగనిరోధక శక్తిని అందిస్తుందని, ఈ వ్యాక్సిన్ సాధారణ గది ఉష్ణోగ్రత వద్ద 9 నెలలకు పైగా స్థిరంగా ఉంటుందని పరీక్షలు సూచిస్తున్నాయి.

ఈ వ్యాక్సిన్‌ను లాక్టోకాకస్ లాక్టిస్ బ్యాక్టీరియా ఉపయోగించి తయారు చేశారు, ఇది వ్యక్తులను రక్షించడమే కాకుండా మలేరియా వ్యాప్తిని కూడా తగ్గిస్తుంది. ఐసీఎంఆర్ ఈ వ్యాక్సిన్ టెక్నాలజీని పరిశ్రమలకు, తయారీదారులకు నాన్-ఎక్స్‌క్లూజివ్ ఒప్పందాల ద్వారా లైసెన్స్ చేయాలని యోచిస్తోంది. దీని ద్వారా విస్తృత ప్రజారోగ్య ప్రయోజనాలను సాధించడం లక్ష్యంగా ఉంది.

'మేక్ ఇన్ ఇండియా' ఉద్దేశాన్ని నెరవేర్చే ఈ స్వదేశీ వ్యాక్సిన్, మలేరియా నిర్మూలనలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్ పరిశోధన, అభివృద్ధి దశలో ఉంది మరియు ఇంకా వాణిజ్య లేదా క్లినికల్ ఉపయోగం కోసం అందుబాటులో లేదు


రాజేంద్రనగర్ లో శ్రీ మాతా పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ను సన్మానిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు


రాజేంద్రనగర్‌లో బోనంతో బాంద్ర పద్మారావు కుటుంబ సభ్యులు


బోనాల పండుగ సందర్భంగా హైదర్ గూడలో సీనియర్ జర్నలిస్టు ఎం బాలసుబ్రమణ్యం నివాసంలో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో లు


వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లో శ్రీ బంగారు పోచమ్మ దేవాలయం లో అమ్మవారిని దర్శించుకున్న బి ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి


మార్కండేయనగర్‌లో ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్


రాజేంద్రనగర్‌లో తొట్టెల తో వడ్డెర సంఘం నాయకులు


రాజేంద్రనగర్ ఈదమ్మ దేవాలయం వద్ద బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ తదితరులు


ఎర్రబోడలో అమ్మ వారి కి బోనం సమర్పించిన మాజీ కార్పొరేటర్ రావుల విజయ జంగయ్య


మైలార్‌దేవుపల్లిలో బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి


# రాజేంద్రనగర్ సర్కిల్‌లో అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు

బుద్వేల్, జూలై 20(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ లో ఆదివారం బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వివిధ బస్తీలలో జరిగిన బోనాల ఉత్సవాలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. తొట్టెల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలతో రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్దేవుపల్లి, శాస్త్రీపురం, సులేమాన్నగర్ డివిజన్లలో ఉన్న అమ్మవారి దేవాలయాలకు భక్తులతో కిట కిట లాడాయి. బోనాల ఉత్సవాల సందర్భంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, బిఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పి.కార్తీక్ రెడ్డి, బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్, మాజీ కార్పొరేటర్ రావుల విజయ జంగయ్య, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీదర్, వివిధ పార్టీల నాయకులు ఎస్.వెంకటేశ్, అక్కెం రాఘవేందర్ యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్తా, ఆల్ యూనివర్శిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మజ్జిగ శ్రీనివాస్ యాదవ్, ఎన్.మల్లారెడ్డి, ఎం.కొమురయ్య, డి.సత్యనారాయణ ముదిరాజ్, పి.మల్లేశ్ యాదవ్, ఎం.రామేశ్వర్ రావు , ఎస్ జైపాల్ , దుంబాల ఉమా రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.


బుద్వేల్ లో....





హైదర్‌గూడలో బోనం సమర్పించడానికి వచ్చిన మహిళలు


రాంబాగ్ దుర్గా మాత దేవాలయంలో బోనం సమర్పిస్తున్న బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు కె ఉమా మహేశ్వరి రెడ్డి




హిమాయత్ సాగర్‌లో బోనాల ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు






# ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం ప్రధాన కార్యదర్శిగా బనుక శివరాజ్ యాదవ్ నియామకం

**ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ల చైర్మన్ ల ఫోరం కమిటీ ఎన్నిక**

**అధ్యక్షుడిగా పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి**

**ప్రధాన కార్యదర్శిగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్**

జనగామ, జూలై 20(ప్రభాత ఉదయం):ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం నూతన కమిటీ ఎన్నిక నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయంలో జరిగింది. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా గా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవ్ రెడ్డి, అధ్యక్షుడిగా పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, ఉపాధ్యక్షులుగా ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి , మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ నాయక్ , నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరీష్ రెడ్డి, కార్యదర్శి గా కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల అండలు శ్రీరామ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిని తన క్యాంప్ ఆఫీస్ లో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేత వెంకటాచారి ,స్టేషన్ ఘనపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జూలకంటి లావణ్య శిరీష్ రెడ్డి, ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి , చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి,యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# నిర్మాణంలో ఉన్న భవనం ఎక్కి యువకుడు హల్ చల్

**రాజేంద్రనగర్ హైదర్గూడలో**

**మూడు గంటలు పోలీసులను ముప్పుతిప్పలు..**

**పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి అతనిని కిందికి దించారు**

రాజేంద్రనగర్,జూలై20(ప్రభాత ఉదయం) నిర్మాణంలో ఉన్న భవనం ఎక్కిన ఓ యువకుడు కిందికి దూకుతానని మూడు గంటల పాటు పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు.పోలీసులు చాకచక్యంగా అతన్ని మాటల్లో పెట్టి కిందకి దించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించిన ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అత్తాపూర్ డివిజన్ హైదర్ గూడ సిరిమల్లెనగర్ లో ఆదివారం మధ్యాహ్నం జరిగింది.స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శంషాబాద్ మండలం ఘాన్సీ మియాగూడ కు చెందిన ఎల్లయ్య గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడు స్వగ్రామం నుంచి అత్తాపూర్ లోని సిరిమల్లె నగర్ కు వచ్చాడు.నిర్మాణంలో ఉన్న ఓ భవనంపైకి ఎక్కాడు.గోవ కట్టెల చివరి అంచున నిలబడి కిందకు దూకేస్తానని స్థానికులను బెదిరించాడు.వారు డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.తన దగ్గరికి వస్తే కిందకు దూకేస్తానని ఎల్లయ్య బెదిరింపులకు పాల్పడ్డాడు. మూడు గంటల పాటు పోలీసులను,స్థానికులను ముప్పుతిప్పలు పెట్టాడు.ఎస్సై రఘు రంగంలోకి దిగి అతన్ని మాటల్లో పెట్టాడు.పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పైకి వెళ్లి అతనిని కిందికి తీసుకొచ్చారు. అనంతరం అతడిని పోలీస్ స్టేషన్ కు తరలించారు. చాకచక్యంగా వ్యవహరించి ఎల్లయ్యను కాపాడిన పెట్రోలింగ్ కానిస్టేబుల్ రాఘవేంద్ర,అంజలయ్య,లేడీ కానిస్టేబుల్ ను స్థానికులు అభినందించారు.



# బుద్వేల్‌లో గంగ పుత్రుల ఆద్వర్యంలో బోనాల ఉత్సవాలు

**బుద్వేల్‌లో....**

బుద్వేల్, జూలై 20 (ప్రభాత ఉదయం): బుద్వేల్ గంగపుత్ర సంఘం ఆద్వర్యంలో ఆదివారం పోచ్చమ్మ తల్లి కి బోనాలు సమర్పించారు. ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. గంగపుత్ర సంఘం అద్యక్షులు, డి,శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ, చేగూరి కైలాష్, ఎ యాదయ్య, డి రాజు, డి .వెంకటేశ్, డి తిరుపతి , ఎ.బాబయ్య, ఎస్ వెంకటేశ్, సి గోపాల్, జి బాలకృష్ణ, ఎన్. శ్రీకాంత్ ఎన్,.సాయిబాబ, ఎన్, సంతోష్, పోచమ్మ గుడి కమిటి అద్యక్షులు,రజిని కాంత్ గౌడ్ , ఎం నరేష్ యాదవ్ , జి వెంకటేష్, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.



వస్త్ర దుకాణం ముందు బార్లు తీరిన మహిళలు

# అగ్గువ.. అగ్గువ.. రూ.35కే చీర పోటెత్తిన మహిళలు..!

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 20(ప్రభాత ఉదయం)అగ్గువ.. అగ్గువ అంటూ ఆషాడం మాసం సందర్భంగా రూ. 35 కే చీర అంటూ ఓ షాపింగ్ మాల్ నిర్వాహకులు ప్రచారం చేశారు.. ఇలా చెబితే ఎవరికి మాత్రం కొనాలని ఉండదు? మహిళలు కదా.. మరింతగా పోటెత్తారు! అయితే ఆఫర్‌ను ప్రారంభించిన కొద్దిసేపటికే చీరలన్నీ అయిపోవడం.. మహిళలు ఇంకా పెద్ద సంఖ్యలో దూసుకురావడంతో నిర్వాహకులు ఉక్కిరిబిక్కిరయ్యారు. చీరలు అయిపోవడంతో వచ్చిన మహిళలు నోటికి పనిచెప్పారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తాలో ఉన్న ఓ షాపింగ్ మాల్ యజమాని ఆదివారం ఆషాడమాసం సేల్ సందర్భంగా కేవలం 35 రూపాయలకే చీర అంటూ ప్రచారం నిర్వహించారు. దీంతో ఉదయం 9 గంటలకే జిల్లా కేంద్రంలోని ఆ షాపింగ్‌మాల్ ముందు వందల సంఖ్యలో మహిళలు పోగయ్యారు. ఆఫర్‌కు అందుబాటులో ఉంచిన కొన్ని చీరలు కొద్దిసేపటికే అయిపోయాయి. ఇదే విషయాన్ని నిర్వాహకులు ప్రకటించడంతో అప్పటిదాకా వేచి ఉన్న మహిళలు అగ్గిమీదగుగ్గిలం అయ్యారు. గంటల కొద్దీ వేచి ఉన్నా చీర ఇవ్వరా? అంటూ మండిపడ్డారు.

# నేడు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడదు

జనగామ, జులై 20 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర పండుగగా బోనాలు పండుగను ప్రకటించిన సందర్భంగా నేడు అన్ని ప్రభుత్వ కార్యాలయలకు సెలవు సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో నేడు నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి విషయాన్ని ప్రజలు గ్రహించి కలెక్టర్ కార్యాలయం నకు రాకూడదని కోరారు.



# జూరాల ప్రాజెక్టుకు పోటెత్తిన వరద.. 19 గేట్లు ఎత్తివేత





### ఎగువ నుంచి 1.15 లక్షల నీరు రాక
### 19 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల
### శ్రీశైలానికి పరుగులు తీస్తున్న కృష్ణమ్మ
### సందర్శకుల తాకిడితో కిక్కిరిసిన జూరాల
### చేపలకు భళే గిరాకి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 20 (ప్రభాత ఉదయం)కృష్ణా బేసిన్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది. దీంతో కర్ణాటకు జలాశయాల నుంచి భారీగా వరద నీరు జూరాల జలాశయానికి వచ్చి చేరుతుండటంతో జూరాల వద్ద కృష్ణమ్మ జలసందడి చేస్తోంది.

#### కర్ణాటక జలాశయాల నుంచి

జూరాలకు 1,15,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా అవుట్ ఫ్లో 1,07,006 క్యూసెక్కులు నమోదైంది. ఇందులో స్పిల్‌వే ద్వారా 74,081 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 29,464 క్యూసెక్కులు వరద నీటిని వినియోగిస్తున్నారు. దీంతో పాటు ఆయకట్టు మీద ఆదారపడిన నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు, కుడి,ఎడమ కాలువలకు 1630, సమాంతర కాలువలకు 700, భీమా లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ ఎత్తిపోతలకు 315 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. జూరాల జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకు గాను ఇప్పుడు 7.389 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది..

#### ప్రాజెక్టుకు పర్యాటకుల శోభ

జూరాల ప్రాజెక్టుకు పర్యాటకుల శోభ సంతరించుకుంది. ప్రాజెక్టుకు ఎక్కడ చూసినా పర్యాటకులే కనిపించారు. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వస్తుండటంతో జలకళను సంతరించుకుంది. జూరాల గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేయడంతో కృష్ణమ్మ అందలాను తిలికించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు ప్రాజెక్టుకు వచ్చి సందడి చేస్తున్నారు. కొందరు జూరాల అందాలను తమ సెల్ ఫోన్ లో బందించారు. కొందరు నీటి అంచునకు వెళ్లి సెల్ఫీల మోజులో పడారు. జూరాల ప్రాజెక్టు పరిసరాలలో సందర్శకుల తాకిడి పెరిగి వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పర్యాటకులు డ్యాం పై నే తమ వాహనాలు నిలిపివేయడంతో కిల్లో మీటర్ మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అమరచింత, ధరూర్ పోలీసులు జూరాల పై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

#### చేపలకు భలే గిరాకీ...

జూరాలకు వస్తున్న వరదను తిలకించేందుకు వచ్చే సందర్శకుల తాకిడి జూరాల చేపల విక్రయదారులకు పంట పండించింది. ఆదివారం చేపలు రికార్డు స్థాయిలో అమ్ముడుపోవడంతో పాటు ధరలు కూడ విపరీతంగా పెంచారు. మిగతా సమయంలో రూ.120కు లభించే చేపలు ఆదివారం రూ.300 నుంచి రూ.400 వరకు విక్రయించారు. అదేవిధంగా జూరాల చుట్టుపక్కల చేపల పులుసు, ఫ్రై దుకాణాలు కిక్కిరిసి పోవడంతో కొందరు వెనుదిరిగి పోయారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు ధరలను లెక్కచేయకుండా ఆరగించి వెళ్లారు.





# విద్యా రంగంలో వినూత్న మార్పులు

### యూ సీటింగ్...ఆసక్తికరమైన ప్రయోగం
### ప్రతి విద్యార్థి పై కన్ను
### విద్యార్థుల మెరుగైన భవిష్యత్తుకే యూ ఆకారం లో సీటింగ్
### కాలంతో పాటు విద్యావ్యవస్థలో కూడా మార్పులు రావాలి
### అధునాతనమైన బోధన, పోషకాలు కలిగిన ఆహారం, మెరుగైన మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం
### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

జనగామ, జులై 20 (ప్రభాత ఉదయం): ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో పెంచుకొని... ప్రభుత్వం యూ సీటింగ్ పద్ధతికి ఆదేశాలు జారీ చేసిందని...ఇందుకు అనుగుణంగా జిల్లా లోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతి గదిలో సీటింగ్ అమరిక యూ ఆకారంలో ఉండే విధంగా ఏర్పాట్లు పూర్తి చేశామని ఆదివారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.యూ సీటింగ్ వల్ల..విద్యార్థులందరి కాన్సంట్రేషన్ ఉపాధ్యాయుల బోధన వైపు ఉండి వారి అభ్యసన మెరుగవుతుందనీ అన్నారు తరగతి గది విస్తీర్ణం, అందులో ఉండే విద్యార్థుల సంఖ్యను బట్టి యు అకార సీటింగ్ ఏర్పాట్లు పూర్తి అయ్యాయని చెప్తున్న కలెక్టర్ మాటల్లోనే యూ సీటింగ్ ప్రయోజనాలు తరగతి గదిలో ఈ విధానంలో కూర్చోబెడితే విద్యార్థుల మధ్య అసమానతలను తొలగిపోయి , వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, పాఠ్యాంశాల భోదన విషయం లో వెనుకభాగంలో కూర్చున్న విద్యార్థులను పరిశీలించడం పూర్తి స్థాయిలో వీలు కాదు... కానీ యు ఆకారంలో ఈ సీటింగ్ విధానం వల్ల ప్రతి ఒక్కరిని దగ్గరగా,సులభంగా వింటున్నారా లేదా అని తెలుసుకోవచ్చని,బ్యాక్ బెంచి స్టూడెంట్స్.. సరిగ్గా చదవరు అని ముద్రపడిన వారిలో ..ఈ పద్ధతి ద్వారా వారి ఏకగ్రత ను, సామర్థ్యాలను పెంపొందించవచ్చన్నారు. తరగతి గదిలో విద్యార్థులు స్వేచ్ఛగా కదలగల సౌకర్యం ఉంటుందని, ముఖ్యంగా విద్యార్థులు తక్కువగా ఉన్న తరగతులలో, చిన్న సమూహాలలో బోధనకు ,ఉపాధ్యాయుల వ్యక్తిగత పరిశీలనకు అనువుగా ఉంటుందని, విద్యార్థులను వరుసలో జత చేయడం, విద్యార్థులు వారి పక్కన కూర్చున్న వారితో సులభంగా అభ్యాసాన్ని పంచుకోవడం వీలవుతుందని, పరధ్యానంగా ఉన్న విద్యార్థులను ఉపాధ్యాయులు సులభంగా గమనించవచ్చన్నారు. యూ ఆకారంలో ఉండే సీటింగ్ ఉపాధ్యాయులు విద్యార్థుల మధ్య ఇంటరాక్షన్‌ను పెంచుతుంది. సాధారణంగా మాట్లాడటానికి ఇష్టపడని విద్యార్థులకు యూ ఆకారంలో సీటింగ్ అమర్చినప్పుడు తరగతి గదిలో చురుగ్గా ఉంటారని, అంతే కాకుండా ఈ సీటింగ్ పద్ధతిలో విద్యార్థుల మనోధైర్యాన్ని మెరుగవుతుందని, ప్రతి విద్యార్థి ఉపాధ్యాయుడిని, బ్లాక్ బోర్డును, ఇతర క్లాస్‌మేట్స్‌ను చూడగలరని, ఉపాధ్యాయుడు విద్యార్థులందరితో మాట్లాడగలరు. ఇతర విద్యార్థుల మాట వినడానికి, వారితో చర్చించడానికి సహాయపడుతుందన్నారు. తరగతి గదిలో విద్యార్థులందరూ ఏం చేస్తున్నారో ఉపాధ్యాయుడు సులువుగా గమనించవచ్చని, విద్యార్థులు తరగతుల్లో మరింత శ్రద్ధ పెట్టేందుకు సహాయపడుతుందన్నారు. సమూహ అభ్యసన సులభమౌతుంది. నలుగురు నుండి ఆరుగురు విద్యార్థులతో కూడిన చిన్న సమూహాల ఏర్పరిచవలసిన అవసరం వచ్చినప్పుడు, విద్యార్థులు త్వరగా మరొక జత డెస్క్‌ల వైపు తిరిగి ఒక సమూహాన్ని ఏర్పాటు చేసుకోనీ గ్రూప్ వర్క్ చేసుకోవచ్చు,బహుళ తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు ఈ సీటింగ్ అమరిక విజయవంతంగా తోడ్పడుతుందని, విద్యార్థులు తమ పాఠ్యాంశ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ,ఉపాధ్యులతో ముఖాముఖి సంభాషించడానికి కూడ చాలా అనువుగా ఉంటుందన్నారు. ప్రయోగత్మకంగా అమలు అయ్యే.....ఈ పద్ధతి వల్ల విద్యార్థులకు మెడ లేదా ఇతర అనారోగ్య సమస్య లు తలెత్తితే.. వెంటనే సీటింగ్ లో మార్పు చేయాలని ఆదేశించామన్నారు. ఇప్పటికే పాఠశాలలో అమలవుతున్న డిజిటల్ బోధన వల్ల ఎంతోమంది విద్యార్థులలో గణనీయమైన అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యాయి....ఇక "యూ" సీటింగ్ వల్ల ప్రైమరీ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు %ఖ% టర్న్ అవ్వాలని తల్లిదండ్రులు ఆకాంక్షిస్తున్నారు.

# వరంగల్ నగరంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలను స్థాపించాలని

# సీఎం రేవంత్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యేల బృందం

### సానుకూలంగా స్పందించిన
### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యేలు



సీఎం రేవంత్ రెడ్డికి క్రీడాశాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు

వరంగల్ 20, (ప్రభాత ఉదయం బ్యూరో): హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సారథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, కేఆర్. నాగరాజు కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ మర్యాదపూర్వకంగా కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై సీఎం తో చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ , తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలను స్థాపించడం ద్వారా రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడానికి , క్రీడలను ప్రోత్సహించడానికి విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అభినందనలు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడలలో ప్రాతినిధ్యం వహించిన అనేక మంది క్రీడా దిగ్గజాలు ఉన్నారని, వారిలో చాలా మందికి కేంద్ర ప్రభుత్వం నుంచి అర్జున, ద్రోణాచార్య అవార్డులు లభించాయని సీఎం కు వెల్లడించారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఒక్కటే ఉందని, ఇందులో జిల్లా క్రీడా అథారిటీ ఆధ్వర్యంలో వివిధ క్రీడలు ఆటలకు సేవలు అందిస్తోందని తెలిపారు. ఈ స్టేడియం రాష్ట్ర జిల్లా స్థాయి విద్యార్థులు ప్రాంతీయ క్రీడాకారులు వారి సాధారణ శిక్షణ కోసం ఉపయోగించబడుతుందని తెలిపారు. ప్రస్తుతం వరంగల్ మహా నగరం అన్ని వైపులా విస్తరిస్తూ జనాభా పెరుగుతోందని, ప్రస్తుత స్టేడియం క్రీడాకారుల అవసరాలను తీర్చలేక పోతుందని వివరించారు. అందుకోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ క్రీడా పాఠశాలను మంజూరు చేయవలసిన అవసరం ఉందని ఇది విద్యా అభ్యాసం, ప్రత్యేక క్రీడా శిక్షణలు, రాష్ట్ర, జాతీయ , అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు, అథ్లెట్లపై దృష్టి పెడుతుందని కోరారు. క్రీడా పాఠశాల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ కూడా భూమి ధర్మసాగర్ మండలం ఉన్నికిచెర్ల గ్రామంలోని సర్వే. నెం. 325లో 20 ఎకరాల భూమి జాతీయ రహదారి 163కి అనుకోని నగరానికి దగ్గరగా అందుబాటులో ఉందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ రెండవ అతిపెద్ద నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వరంగల్ ఉత్తర తెలంగాణలో ఒక విద్యా కేంద్రంగా ఉందని, ఇక్కడ నీట్ , కాకతీయ విశ్వవిద్యాలయం, డాక్టర్ కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, 3 మెడికల్ కాలేజీలు ,ప్రభుత్వ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు అనేక విద్యా సంస్థలు ఉన్నాయని తెలిపారు. క్రీడా రంగంలో క్రికెట్ అత్యంత ప్రాముఖ్యత క్రీడ కావడంతో చాలా మంది యువత విద్యార్థులు క్రికెట్ ఆడటానికి ఆసక్తి చూపుతున్నారని , అందువల్ల వరంగల్‌లో ప్రత్యేక క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలనీ యువత విద్యార్థుల నుంచి డిమాండ్ ఉందని తెలిపారు. వరంగల్ నగరాన్ని తెలంగాణ రెండవ రాజధానిగా అభివృద్ధి చేయడానికి మీరు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారాని, అందులో భాగంగానే నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విమానాశ్రయం, ఇన్నర్ రింగ్ రోడ్, ఓఆర్ఆర్, మెగా టెక్స్‌టైల్ పార్క్ మొదలైన వాటికి భారీ నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే వరంగల్ నగరంలో ప్రత్యేక క్రికెట్ స్టేడియం మంజూరు చేస్తే వరంగల్ మహా నగరానికి మనిహారంగా మారుతుందని కోరారు. వరంగల్ నగరానికి తెలంగాణ క్రీడా పాఠశాల ప్రత్యేక క్రికెట్ స్టేడియంను వీలైనంత తొందరగా మంజూరు చేయాలనీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సారథ్యంలోని ఎమ్మెల్యేల బృందం చేసిన విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత శాఖ సెక్రెటరీకి ఫోన్ చేసి వరంగల్ నగరంలో తెలంగాణ క్రీడా పాఠశాల క్రికెట్ స్టేడియం ఏర్పాటు ప్రతిపాదనలు పరిశీలించి అందుకు అవసరమైన విధి విధానాలను రూపొందించాలని ఆదేశించారు. వరంగల్ నగరాన్ని మరింత గొప్పగా అభివృద్ధి చేసేందుకు నా వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, అతి త్వరలో క్రీడా పాఠశాల క్రికెట్ స్టేడియం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇందుకు ఎమ్మెల్యేల బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# జూరాల వద్ద పోలీస్ బందోబస్తు



గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 20(ప్రభాత ఉదయం) జూరాలకు వరద ప్రవాహం పెరగడంతో ప్రాజెక్టు 19 గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో కృష్ణానది అందాలను చూడటానికి సందర్శకుల తాకిడి పెరిగిపోయింది. జూరాల డ్యాంపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా అమరచింత, ఆత్మకూర్, ధరూర్ పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించారు. ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి అధికంగా ఉండడంతో వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ రావు ఆదేశానుశారం గద్వాలసిఐ శివకుమార్ పర్యవేక్షణలో ఆత్మకూర్ రెండవ ఎస్సై హిమబిందు రాథోడ్ ప్రాజెక్టు దగ్గర భారీ బంధవస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రజలు వరద పరిస్థితుల్లో సెల్పీల పేరుతో ఇబ్బందులకు గురికావొద్దని, ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నందున సందర్శకులు నదిలో దిగొద్దని సూచించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608